


బోయినపల్లిలో మా ఇల్లు కట్టి ఇంకా పూర్తిగా ఏడాదయినా కాలేదు. సొంత ఇల్లు కట్టుకోవడం, అందులో వుండడం అనే నిషాలోంచి మేమెవ్వరం యింకా బయటపడలేదు. మాటిమాటికీ ఒక్కొక్క గదిలోకి వెళ్ళి కాసేపు కూచునేదాన్ని. రకరకాల యాంగిల్స్‌లో, తలుపులు దర్వాజాలను చూస్తుండేదాన్ని. మా చిన్ని తోటలోకి రకరకాల మొక్కలు కొనుక్కుని వచ్చి వేసేదాన్ని. మా చిన్నపుడు సినిమాల్లో అడ్డంగా ఆకులేసి గోడలాగా కనపడుతూ, కాయలే కాయని అరటి చెట్లలాంటివి చూపించేవారు. బహుశా అవి వాహినీ స్టూడియోలో వుండేవనుకుంటా! అందుకే ప్రతి సినిమాలోనూ

కనిపించేవి. ఇల్లు పూర్తవగానే ముందు అలాటి మొక్కలు తెచ్చివేశాను. కడియం నుంచి దొంతరమల్లె దుబ్బులు తెప్పించి వేస్తే సుమారు పాతికేళ్ళపాటు బుట్టలు బుట్టలు పూశాయి. పెరటి రెండువైపులా రెండు కొబ్బరి చెట్లు కూడా వేశాం. డాబా ఎక్కి నాలుగు వైపులా చూస్తుంటే నాకు ఎంత ఆనందంగా వుండేదో! ఈ భూమి మీద మొట్టమొదటి ఇల్లుకట్టినది నేనే నన్నంత ఆనందంగా వుండేది. నాకు చిన్నప్పటి నుంచి గార్డెన్లో చిన్నవుయ్యాల వుండాలని కోరిక. అదికూడా పెట్టించాను. నా ఫ్రెండ్సు చాలామంది ఉయ్యాల వూగడానికి, మధ్యాహ్నాలు ఎ.సి. రూంలో పడుకోవడానికి వచ్చేవారు. ఇపుడందరిళ్ళల్లో ఎ.సి.లు వచ్చాయిగాని అప్పుడు అవీ గొప్పే! అందుకే ఎవరన్నా మా ఇంటినేమన్నా అంటే పట్టరాని కోపం వస్తుంది. మా ఇంటికింకో లక్షణం వుంది. ఎప్పుడు చూసినా బోలెడు మంది జనం వుండేవారు. మొన్నీమధ్య నేమన్నా పెళ్ళయిందా లేకపోతే మళ్ళీ వారం పెళ్ళి జరగబోతోందా అన్నట్లుగా వుండేది. మా మామయ్య మా ఇంటిని బోయినాలపల్లి అనేవాడు.

పిల్లల స్కూళ్ళకి సెలవులిచ్చేశారు. ఏకంగా భోజనాల వేళ్టికే లేస్తారు మరి. పెద్దవాళ్ళం అందరం లైట్‌గా టిఫిన్లు తిని కబుర్లు చెప్పుకుంటున్నాం. వాకిట్లో ఆటో ఆగిన చప్పుడయింది. ఇప్పుడే చుట్టాలు వచ్చారబ్బా! అని ఆశ్చర్యంగా చూశా. గేటు తీసుకుని లోపలికి ఒక చుడీదారు వేసుకున్న అమ్మాయి కష్టపడి సూట్‌కేసు మోస్తూ వస్తోంది. ఇంకెవరూ! మా జోద్పూరన్నయ్య గారాలపట్టి అమ్ము.

"ఇదేవిటే చెప్పాపెట్టకండా వూడిపడ్డావ్. ఎక్కడ్నించీ రాక" మంచినీళ్ళిస్తూ అడిగాను. "దక్షిణ్‌లో వచ్చానత్తయ్యా! జోద్పూరు నుంచి ఢిల్లీ వచ్చి అక్కడ్నించి వస్తున్నా" అంది అమ్ము.

"అమ్మా నాన్నా ఏరి?"

"వాళ్ళెవరూ వచ్చే ప్లాన్లేం లేవు. పిల్లలకి పరీక్షలయిపోయుంటాయి. అందరూ ఖాళీగా వుంటారు కదా! ఇక్కడయితే సరదాగా వుండవచ్చునని వచ్చా. ఒక నెల్లాళ్ళు వుంటా" అంది.

"ఒక నెల కాకపోతే మూడునెలలుండు! అవునూ! నువ్వేదో వుద్యోగం చేస్తున్నావన్నాడు నాన్న..." అనడిగా.

"ఆ... చేశా! ఏదో ఆడపిల్లల కాలేజీలో డిమాన్‌స్ట్రేటరుద్యోగం. ఒకావిడ మెటర్నిటీ లీవ్‌లో వెడితే నన్ను తీసుకున్నారు. పిల్లల పరీక్షలయిపోగానే తీసేసారు. ఇక్కడే ఏదయినా చేసుకుంటా! నీకెక్కడయినా తెలిస్తే చెప్పత్తయ్యా. నీకు తెలియని

వాళ్ళెవరున్నారు ఈ వూళ్ళో" అంటూ సూట్‌కేసు తీసుకుని బామ్మగదిలోకి వెళ్ళబోయింది. ఇంతలోకి "అమ్ము వదిన వచ్చిందా?" అంటూ ఏనాడో తప్పిపోయిన పిల్ల దొరికిన తల్లిలాగా మా అమ్మాయి శైలు వచ్చి దాన్ని కావలించుకుంది. ఇంక వాళ్ళిద్దరూ కలిసి ఒకే లోకంలో వుంటారు, తింటారు, తిరుగుతారు.

ఇంతకీ అమ్ము అనబడే ఈ అతిథి మా అన్నయ్యకి ముగ్గురు మగపిల్లల తర్వాత పుట్టిన గారాబాల కూచి. సైరాబానులా వుంటుందని దాన్ని చిన్నపుడు సైరాబాను అనే పిలిచేవాళ్ళం. ఇప్పుడూ అందంగా అలాగే వుంటుంది. దాన్ని వాళ్ళెవరూ నేల మీద నడవనివ్వరు. దానితో కాస్త మంకుతనం, బద్ధకం లాంటి లక్షణాలు బాగా వంటపట్టాయి. వాళ్ళనాన్న పెట్టే పోరు భరించలేక కష్టపడి ఎమ్మెస్సీ. పాసయింది. కానీ చదువు మీద పెద్ద ఆసక్తిగానీ, శ్రద్ధగానీ లేవు. దాని చక్కదనం చూసి ఏ అందాల రాకుమారుడో రాకపోతాడా అని ఒక గట్టినమ్మకం. దానికీ, దానికన్నా ఏడెనిమిదేళ్ళు చిన్నదయిన పదోక్లాసు చదువుతున్న నాకూతురికీ స్నేహం. రెండ్రోజులు గడిచాక మా అమ్మాయి నెమ్మదిగా నా పక్కన చేరింది. సాధారణంగా ఆ వయసు పిల్లలకి వాళ్ళల్లో వాళ్ళకి చాలా రహస్యాలుంటాయి. అందుకే ఏ డాబామీదో కూచుని గుసగుసలాడుతుంటారు. మనం అడిగినా చెప్పరు. ఏదైనా విశేషముంటే అందరికన్నా ఆఖర్న తెలిసేది అమ్మా, నాన్నలకే. ఇది నా పక్కన చేరిందంటే ఏదో విశేషముంటుందని గ్రహించి ఆరాతీశాను. "అమ్మా! వదిన ఇక్కడికి వుద్యోగం చేయడానికి రాలేదు. మావయ్యతో పోట్లాడి ఇక్కడికి వచ్చేసిందిట. మన దగ్గిరే వుంటుందిట" అని నెమ్మదిగా చెప్పింది. ఒక్కసారి ఉలిక్కిపడ్డాను.

"వాళ్ళ నాన్నతో పోట్లాడి రావడమేమిటే? ఇంట్లో ఎవరూ అది గీచిన గీటు దాటరు కదా! అంత గొడవెందుకు పెట్టుకున్నాడు మావయ్య?" అనడిగాను.

"మరేం! మరేం! వదినకోసం మావయ్య ఒక సంబంధం తెచ్చాడు. అబ్బాయికి బాంబేలో ఏదో వుద్యోగం. వదిన కూడా వుద్యోగం చేయాల్సి వస్తుంది. ఆ అబ్బాయికి చాలా బాధ్యతలున్నాయిట. పైగా చాలా పొట్టిగా వుంటాడుట" అని చెప్పింది. అసలు మా అన్నయ్య దీనికి అంత నప్పని సంబంధం తేడే! "ఒకవేళ ఎవరినన్నా ప్రేమించిందా?" అనడిగా. "సరిగ్గా నేను కూడా అదే అడిగానమ్మా. 'ప్రేమా! నాబొందా, మా యూనివర్సిటీలో ఏ కుర్రవెధవయినా నన్ను చూసి నవ్వేందుకు కూడా వణికి చచ్చేవాడు. నాన్నంటే అంత భయం అక్కడ స్టూడెంట్సుకి. ఇంక నా వుద్యోగం ఆడపిల్లల కాలేజి. పోనీ బయట వాళ్ళెవర్నయినా చూద్దామంటే అందరూ మార్వాడీలు. చూడ్డానికి అందంగా వుంటారు. గానీ ఆలోచనలన్ని వందేళ్ళు

వెనక్కుంటాయ్. ముసుగేసుకుని తిరుగుతూ రోజుకిరవైమందికి రోటీలు చేయాలి. నావల్ల కాదు. తెలుగబ్బాయిలే నయం' అంది. 'అమ్మా! నువ్వెవరెవరికో సంబంధాలు చూస్తూ వుంటావుగా! కాస్త మంచబ్బాయిని చూడు పాపం" అని మా అమ్మాయి నా దగ్గర తన భారం దింపుకుని నాకెక్కించి వెళ్ళిపోయింది. నెల్లాళ్ళు ఇట్టే గడిచిపోయాయి. అంత కావాలనుకుంటే అన్నయ్య ఉత్తరం రాసేవాడు కదా, నేనెందుకు కల్పించుకోడం అని పూరుకున్నాను.

నాకు శ్యామల అని ఒక స్నేహితురాలుంది. యూనివర్సిటీలో బాటనీ లెక్చరరుగా పనిచేస్తుండేది. తను పుట్టిపెరిగిందంతా హైదరాబాదులోనే. మా ఇద్దరికీ ఒక కామన్ హాబీ. అది పెళ్ళి సంబంధాలు చెప్పడం. చాలా సమాచారాన్ని ఎక్స్చేంజ్ చేసుకునేవాళ్ళం. ఆ రోజుల్లో ఈ మారేజిబ్యూరోలు, ఆన్‌లైన్ పరిచయాలు లేవుకదా! అందువల్ల మాలాటి వాళ్ళకి చాలా డిమాండుండేది. ఫలాన కుటుంబం తెలుసూ, అని తెలుసున్న వాళ్ళెవరయినా గట్టిగా చెప్తేగానీ సంబంధాలు చూసేవారు కాదు. తను ఒకరోజు హడావిడిగా ఫోన్ చేసింది. "సుశీలా! ఒక మంచి సంబంధం వచ్చిందోయ్. వాళ్ళు మాకు మా అత్తగారి వేపు బంధువులు. ఒక చిన్న సైజు జమీందారులు. నిఖార్సైన తెలంగాణా బ్రాహ్మలు. వాళ్ళబ్బాయి కంప్యూటర్ ఇంజనీరు. చాలా మంచివాడు, అందంగా వుంటాడు. అయిదేళ్ళయింది. అమెరికా వెళ్ళి ఇపుడొచ్చాడు. ఇంకో పదిరోజులుంటాడంతే. వెళ్ళేలోపున పెళ్ళి చేసి పంపాలని మా పిన్ని వాళ్ళు తొందరపడుతున్నారు. రెండు మూడు సంబంధాలు చూసారు కానీ అతనికి నచ్చలేదు. నీకెవరైనా తెలిస్తే చెప్పవా?" అనడిగింది. "ఆలోచిద్దాం వీలైనపుడురా! ఈలోగా నేనుకూడా గుర్తుకు తెచ్చుకుంటాను" అని చెప్పి ఫోన్ పెట్టేశాను. ఆ క్షణంలో మా ఇంట్లోనే ఒక పెళ్ళికూతురుందని కూడా నాకు తోచలేదు. అన్నయ్యకి చెప్పకుండా తననడగకుండా నేనేపనయినా ఎలా చేస్తాను? సరిగ్గా అరగంటలో కారేసుకుని తన డైరీ తీసుకుని మా ఇంటికి వచ్చింది శ్యామల. అటు ఇటు తిరుగుతున్న మా అమ్మని చూసి "ఎవరీ అమ్మాయి?" అనడిగింది. ఏం చదువుకుందని అడిగింది. అన్నీ చెప్పాను. "అదేవిటోయ్! బిడ్డని చంకలో పెట్టుకుని పూరంతా వెతికినట్లు ఇంత చక్కటి పిల్ల ఎదురుగా వుండగా వేరే ఆలోచన ఎందుకూ?" అని అడిగింది. 'నిజమే అనుకో! కానీ అవతల వాళ్ళు బాగా డబ్బున్నవాళ్ళంటున్నావ్! మా అన్నయ్య తూగలేడు అని ఆలోచిస్తున్నా" అన్నా. "వాళ్ళకి డబ్బుంటే మననేం కొట్టింది. వాళ్ళకి కావలసినది డబ్బుకాదు. లక్షణమైన పిల్ల. ఇంక ఆలోచించకు" అని పెళ్ళికూతురి వివరాలన్నీ తీసుకుని వాళ్ళింటికి వెళ్ళిపోయింది. అన్నట్లు పెద్దన్నయ్యంటే దూరాన వున్నాడు కానీ మా బుల్లెన్నయ్య,

వదిన ఇక్కడే వున్నారు. మా వివరాలు నచ్చాయని తెలియగానే వాళ్ళిద్దరూ వెళ్ళి పిల్లను చూసుకునేందుకు రమ్మని ఆహ్వానించి వచ్చారు. మర్నాడు సాయంత్రం నాలుగుగంటలకి పెళ్ళిచూపులకి వస్తామని చెప్పారుట. అసలు వాళ్ళు ఇంటరెస్టు చూపించడంలో మా ఇంటిపేరు సోమరాజువారవడం కూడా కలిసి వచ్చింది. "మన తెలంగాణా వాళ్ళే! ఖమ్మంజిల్లా సత్తుపల్లివాళ్ళు. సోమరాజు వారు చాలా మర్యాదస్థులని మురిసిపోయారుట.

ఇంక తెల్లవారగానే మా ఇంట్లో పెళ్ళిచూపుల హడావిడి మొదలయింది. పెట్టెలో రెండు డ్రస్సులేసుకుని రైలెక్కిన దీనికి పెళ్ళిచూపులకి సరిపోయే చీరలేమీలేవు. దానికి లేకపోతేనేం నా దగ్గిరున్నాయిగా! నా బీరువా అంతా కెలికి నాకున్న చీరలన్నిటిలోకీ అందమైనదీ, ఖరీదయినదీ, నాకిష్టమయినదీ అయిన గద్వాల్ పట్టుచీర ఎంచాం. ఆకుపచ్చరంగు చీరమీద జరీ డోరియా. ఆరంగుళాల వెడల్పుగా మిరపపండు రంగు అంచు. దానిమీద జరీ చిలకలు. పైటకొంగు నిండా రెండు పెద్ద జరీ చిలకలు. మీరే వూహించుకోండి. ఎంతబాగుంటుందో! అటువంటి చీరకోసం ఆ తరువాత నేను ఎంత వెతికినా దొరకనేలేదు. పొద్దున్నే వదినా మరదళ్ళిద్దరూ జనరల్ బజారుకి వెళ్ళి ఆ చీరకి నప్పే బ్లౌజ్ కొనుక్కొచ్చారు. పదకొండున్నరకి తలంటుపోసుకోడానికి బాత్‌రూంలో దూరిన పిల్ల రెండుగంటలకి తలుపు బద్దలు కొడతామని అరిస్తే బయటకొచ్చింది. ఇంక అప్పట్నించీ సింగారాలు. ఇంట్లో వున్న వాళ్ళందరి నగలు తగిలించుకుంది. మా అమ్మ ఆనవాయితీ తప్పకుండా మడత కాజాలు చేసింది. "పెళ్ళిచూపులకెప్పుడూ కాజాలు చేస్తావేవిటే అమ్మా" అనడిగితే "మరీ ... అదీ ... కాజాలు చేస్తే సంబంధం కుదుర్తే కుదుర్తుంది'' అని మహా నియోగంగా చెప్పేది. నేను సగ్గుబియ్యం వడలు చేసాను. అలాటివి మనవాళ్ళు చేయడం తక్కువ. మగ పెళ్ళివారికి కొంచెం మహారాష్ట్ర బంధుత్వాలు కూడా వున్నట్లనిపించి, వాళ్ళ సంతోషిస్తారు కదా అని చేసాను. సరిగ్గా నాలుగు కొట్టేటప్పటికి వచ్చారు. ఆవిడ కాసేపు పిల్లను పలకరించారు. పిల్లతో మాట్లాడాలన్నాడు పెళ్ళికొడుకు.

"మేం చాలా మోడర్న్ వాళ్ళం, మాకేం అభ్యంతరం లేదు" అన్నట్లుగా పోజు కొడుతూ గార్డెన్లో ఉయ్యాల మీద కూచుని మాట్లాడుకోండని పర్మిషన్ ఇచ్చాం. పెళ్ళికావలసిన అబ్బాయి అమ్మాయి ఒక పదినిమిషాలు ఆ ఉయ్యాల ఊగుతూ కబుర్లు చెప్పుకుంటే వాళ్ళ పెళ్లి జరిగితీరుతుందని నాకొక మూఢనమ్మకం. అసలు ఈ సంఘటన జరిగింది నిన్నామొన్నా కాదు. సుమారు ముప్పై ఏళ్ళ క్రితం జరిగింది.

ఇలా అబ్బాయిలు, అమ్మాయిలు అంత విరివిగా అమెరికా వెళ్ళని రోజులు అవి. చాలా కుటుంబాలు తమ పిల్లల్ని అంత దూరం ఇవ్వటానికి జంకేవారు. ఒక కాలుకొచ్చినా, కడుపునొచ్చినా అయ్యో తల్లీ అనేందుకు ఎవరుంటారు? అనుకునేవారు. ఇంకా డబ్బులు, ఫ్లాట్లు కార్లు మన జీవితాలని అంతగా ప్రభావితం చేయలేదు. ఎలాగైతైనేం రాత్రి ఎనిమిది గంటలకి వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళారు పెళ్ళివారు.

ఏ సంగతీ రెండు రోజుల్లో చెప్తామన్నారు. రొట్టె విరిగిందని తెలుస్తోంది కానీ, అది ఎందులో పడుతుందో తెలియాలి కదా! ఇంక మా ఇంటిల్లిపాదికీ ఒకటే టెన్షను. ఫోన్ కుయ్ అంటే చాలు. అందరం పరిగెత్తేవాళ్ళం. వాళ్ళు ముందుగా చెప్పినట్లే రెండు రోజుల తర్వాత రాత్రి తొమ్మిది గంటలకి ఫోన్ చేసారు. వెంటనే మాట్లాడుకోడానికి రమ్మని! ఇంక మా ఇంట్లో సందడే సందడి. నేనూ మా ఆయనా, మా బుల్లెన్నయ్యా వదినా రాత్రి పదిన్నరకి పెళ్ళి వారింటికి చేరాం (ఇంక అలా అనవచ్చు వాళ్ళని) ఇంతవరకు తమరి కూతురి పెళ్ళి నిశ్చయమవుతోందని అన్నయ్యా వదినలకి ఎటువంటి వర్తమానమూ చేయలేదు. వీళ్ళు పిల్ల నచ్చిందన్నాక ఫోన్ చేయచ్చులే అనుకున్నాం. అప్పట్లో వాళ్ళవూరు ఫోన్ చేయడం కూడా పెద్ద పనే. అన్నయ్యకి ఫోన్ లేదు మరి. ఇంతకీ మేము మాట్లాడుకున్నదేవిటీ? కట్నాలూ కానుకలూ కాదు. వాళ్ళకేమీ అక్కర్లేదుట. కానీ మళ్ళీ ఆదివారం పెళ్ళి చేయాలిట. పెళ్ళికి 1500 మంది వస్తారనీ రాత్రి భోజనాలకి రెండువందలమంది వుంటారని ముందు రోజు రాత్రి కూడా రెండువందలమంది వుంటారని చెప్పారు. వాళ్ళకి ఋగ్వేద సాంప్రదాయం కాబట్టి వాళ్ళ వూరి నుంచే పురోహితులు వస్తారని అన్నారు. వంటలు, భోజనాలు అన్నీ తెలంగాణా పద్ధతులే వుండాలి. ఒక ఇరవైమందికి ప్రత్యేకంగా మడిభోజనాలు. మర్నాడు ఉదయం 10 గంటలకి నిశ్చయతాంబూలాలు. డెబ్బైమంది వస్తారుట. అందులో ఆరుగురికి మడి భోజనాలు.

సరే మాకు జమీందారీలు లేవు. దీనికి తగ్గ పద్ధతులూ లేవు. వాళ్ళ పద్ధతులే మావి అనుకుని అన్నిటికీ సరే అన్నాం. అజ్ఞానం ఇచ్చే ధైర్యం విజ్ఞానం ఇవ్వదుకదా! ఏదో ఒకటో రెండో శుభకార్యాలు చేసాను కానీ ఈ లెవెల్లో అనుభవం లేదు. పైగా అప్పటికి కాటరింగ్‌తో సహా అన్నీ కాంట్రాక్టు పద్ధతి లేదు. పెళ్ళికి కావల్సిన పూజాసామగ్రి కూడా ఎవరయినా బజారుకెళ్ళి తేవాల్సిందే! అన్నీ వండి వడ్డించవలసిందే. ఇప్పటికీ మా ఇంట్లో కాటరింగ్ అంటే మా ఆయన వప్పుకోరు. వంటవాళ్లొచ్చి చేయాల్సిందే. సరే అని ఒప్పుకుని ఇంక పెళ్ళి పనులు ప్రారంభించాలని బయల్దేరబోతుంటే వియ్యపురాలు నన్ను పిలిచి "సుశీలగారూ! మగవాళ్ళకి అన్నీ

తెలియవని నేను అక్కడ చెప్పలేదు. మీ అన్నగార్ని ఓ పదిహేనువేలు బాంకులో పిల్లపేర్న వేయమనండి! అమ్మా నాన్నలెప్పటికీ వుండరు కదా! అన్నదమ్ములు కట్నాలు తెస్తారు – తేరు. నా కొడుకు, కోడలు పీటలమీద కూచుంటే ఎప్పటికీ పుట్టింటి వారి కట్నాలుండాలి. నాకోడలు చిన్నబుచ్చుకోరాదు" అంది. ఆ మాటలు వినగానే నా కళ్ళు నీళ్ళు తిరిగాయి. ఇంత సున్నితంగా ఆలోచించే ఈవిడకి కోడలుగా కాబోయే నా మేనకోడలు మా అందరి పరువూ నిలబెట్టాలని ఆ భగవంతుడిని నా మనసులో వేడుకున్నా.

ఇంక మా అందరికీ పరీక్ష మొదలైంది. తెలంగాణ పద్ధతిలో ముందు ఆడపెళ్ళివారు అయిదురకాల స్వీట్లు పూలదండలు తీసుకెళ్ళి పెళ్ళికొడుక్కీ ఇతర పెద్దలకీ దండలేసి స్వీటు తినిపించి మా ఇంటికి వచ్చి తాంబూలాలు తీసుకోమని ఆహ్వానించాలిట. సరే ఆ పని మా అన్నయ్యా వదినలకి చెప్పాను. ఇంక నా పని మా ఇంట్లో డెబ్బైమందికీ భోజనాల ఏర్పాటు చేయడం. మా బంధువులెవరినీ పిలిచే పని పెట్టుకోలేదు. మా ఆస్థాన వంటాయన సత్యంగారిల్లు మేం వచ్చే దారిలోనే వుంది. "ఏవండీ! సత్యంగారిల్లు ఈ దారిలోనే వుంది. కాస్త చెప్పితీసుకెళదాం" అని అడిగాను. "ఈపాటి వంటకి ఆయనెందుకూ! నువ్వూ అమ్మా చేసెయ్యలేరూ?" అన్నారు. ఇంకనాకు ఎక్కడలేని పౌరుషం వచ్చేసి "ఎందుకు చెయ్యలేమూ! అవసరమయితే పెళ్ళి వంట కూడా చేసేస్తాం" అని మాట్లాడకుండా కూచున్నా. నేనెంత తెలివితక్కువదాన్నో అర్థమయింది కదా! అనవసరమైన గొప్పలకి పోయి నానా బాధలూ పడుతూ వుంటాను. ఇలాంటి ఛాలెంజ్‌లు చాలా స్వీకరించానని నేను చెప్పుకున్నా ఇప్పుడు ఎవరూ నమ్మరు. పైగా అటుతిరిగి నవ్వుకుంటారు. కానీ ఇది మాత్రం సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అన్నంత సత్యం. మా ఆయనకి తగ్గావిడే మా అత్తగారు. ఇంటికి రాగానే "అత్తయ్యగారూ! మనల్నే చేయమంటున్నారు ఈయన. పైగా మసాలా వంట" అన్నాను. "అదేం భాగ్యం! నువ్వున్నావు! నేనున్నాను. ఇంకేం కష్టం" అన్నారు. మా అమ్మని లేపి చెప్పలేదు. లేచిందో నన్ను తిట్టరాని తిట్లన్నీ తిట్టి నాకున్న కాన్ఫిడెన్స్ పోయేలా చేస్తుంది. మందులేసుకు పడుకుందిగా! అలా వుండనీలే అనుకున్నాను. ఇంక చూసుకోండి. మా ఇంట్లో అర్థరాత్రి అంకమ్మ శివార్లు.

మా ఇంట్లో ఎప్పుడూ ఏడాదికి సరిపడా కిరాణా సరుకులుండేవి. ఎటుపోయెటు వస్తుందోనని ఏడాదికి సరిపడా పప్పులు, ఉప్పులన్నీ కొని పారేసేదాన్ని. చిన్నపరిశ్రమల వాళ్ళం కదా! ఎప్పుడూ బతుకు భయమే. ఇంట్లో డబ్బాల నిండా పప్పులు, బియ్యాలు

ఇచ్చే ధైర్యం ఆడవాళ్ళకి ఇంక ఏదీ ఇవ్వలేదు. రెండు కిలోల కాబూలీ శనగలుంటే శుభం అంటూ అత్తగారు కాస్త వేడినీళ్ళల్లో పోశారు. రెండు పెద్ద కుక్కర్లలో మూడు నాలుగు కిలోల కందిపప్పు వుడికించి పక్కన పెట్టాం. అత్తయ్యగారు రెండు బిందెలు తీసుకుని బయలుదేరారు. ఆ రోజుల్లో మా ఇంటివెనక గొల్లల కుటుంబాలుండేవి. వందలాది గేదెలు, ఆవులు వుండేవి. మాకు పాలు కూడా వాళ్ళే పోసేవారు. అత్తగార్ని చూడగానే ఆ రెండు బిందెల నిండా పాలు పిండి ఒక కుర్రాడి నెత్తిన పెట్టి ఆవిడ వెనుకే పంపించారు. కొంచెం తిరగమోత వేయించి మా ఇంట్లో ఏడాది వాడకం కోసం అట్టిపెట్టుకున్న గోంగూరపచ్చడి చేసాను. ఆరోజు మా ఇంటివంటలో అదే హైలైట్. వంకాయ మసాలా అంతా రెడీ పెట్టాను. ఇంక తూర్పు తెల్లవారుతోందనగానే డ్రైవర్ని మార్కెటుకి పంపి మొత్తం కూరలు, పళ్ళు తెప్పించాను – హైదరాబాదులో పదిన్నరయితే కానీ ఏ షాపులూ తెరవరు. కూరగాయల సందడి మాత్రం అన్ని వూళ్ళల్లో లాగా తెల్లవారగట్లే ప్రారంభమవుతుంది. తెల్లవారి తొమ్మిదయేటప్పటికి పులావు, బగారాబైంగను, ఆలూ కూర్మా, చన్నామసాలా, పాలకూర పప్పు, సాంబారు, కొబ్బరి కీరా పెరుగుపచ్చడి, గోంగూర పచ్చడితోసహా మా వంట అయిపోయింది. గులాబ్‌జామ్‌లు, జిలేబీలు మిఠాయి భండార్ నుంచి తెప్పించా. మా అమ్మ నిద్రలేచి చూసి అంతా రాక్షస బుద్ధులూ, రాక్షసపనులూ అని విసుక్కుంది. ఇపుడు ఆవిడ మడికట్టుకుని ఆరుగురికి మడి వంట చేయాలిగా మరి. నా స్నేహితురాలొకావిడ వెంకటగిరి చీరల వ్యాపారం చేసేది. నా ఫోనందుకుని వున్న వాటిల్లో ఓ పది మంచి చీరలు పనివాడితో పంపింది. ఇంక మగవాళ్ళకి బట్టలు పెట్టే పని అనుకోలేదు. ఆదివారం ఏషోరూం తీస్తారు? అందరికీ బట్టల బదులు డబ్బు కవర్లే ఇచ్చాం.

అన్నయ్య వదిన పెళ్ళివారిని తీసుకుని వచ్చేటప్పటికి పన్నెండయింది. పురోహితుడు మా బుల్లెన్నయ్య వదిన చేత తాంబూలాలిప్పించారు. లగ్నపత్రిక రాసారు. 'ఫలానా ముహూర్తంలో వివాహం నిశ్చయించారు కాబట్టి పెళ్ళివారిని సపరివారంగా రమ్మని ఆహ్వానిస్తూ' మా అన్నయ్య చేత లేఖ రాయించారు. అలాగే 'ఆహ్వానాన్ని అంగీకరించి వస్తున్నాం కాబట్టి ఏర్పాట్లు చేయమ'ని వియ్యంకుడిగారిచేత మా అన్నయ్యకి జవాబు రాయించారు. లాకర్లో వున్న బంగారం తీయడానికి సమయం లేదు కాబట్టి ఆవిడ తన ప్రధానం చీర ఇచ్చి తన చేతికున్న నాలుగు జతలగాజులూ కోడలి చేతికి వేశారు. తాంబూలాలకి కూడా ఇంత వ్యవహారముంటుందా అని ఆశ్చర్యపోయాను. ఈ కార్యక్రమం అంతా అయేటప్పటికి రెండయింది. ఈ లోగా మా ఫాక్టరీ అమ్మాయిలు వచ్చి పూరీలు, మిర్చీలు వేయించారు. అప్పట్లో బఫే

వడ్డనలు కూడా అంతగా లేవు. ఎంతమంది వున్నా చచ్చినట్లు నడుంవంచి వడ్డించాల్సిందే. మడి వాళ్ళందరికీ మా అత్తగారి గదిలో అమ్మ చూసుకుంది. "మనం భోజనాలు చేద్దామా?" అని అడిగాను వియ్యపురాలిని. "చేద్దాం కానీ ముందు డ్రైవర్లకి పెట్టండి. మా ఇంట్లో అదే అలవాటు" అన్నారు. ఈశ్వరా! అన్ని పరీక్షలూ చెప్పి పెట్టవుకదా! ముప్ఫైమంది డ్రైవర్లూ వేడివేడిగా వున్న నా వంటని ఆవురావురుమని సగానికిపైగా తినేశారు. వారి గొప్ప సంస్కారానికి జోహార్లర్పించాను. అదేవిటో ఆవిడ మర్యాద. తన చిట్టచివరి చుట్టం కూడా తిన్నాక వాళ్ళిద్దరూ భోజనానికి లేచారు. పులావూ, బగారా బైంగను అయిపోతేనేం, వేడివేడి ఆలుగడ్డ వేపుడూ, టమాటా పెరుగు పచ్చడీ, మంచి కందిపొడి, ఆవకాయలతో భోజనం పెట్టాం. ఏం వుంటాయో వుండవో అని భయపడ్డాను. కానీ కొండలాంటి అత్తగారు నా వెనక కనిపెట్టి వున్నపుడు నాకేం లోటు. పెళ్ళివారంతా సంతోషంగా వెళ్ళారు. సాయంత్రం ఆ అబ్బాయి వచ్చి అమ్మని బయటకి తీసుకెళ్ళాడు. మేమంతా రెడీ అని మా పిల్లమేళమంతా వెంటపడితే అందుకే బైక్ మీద వచ్చానని వాళ్ళని వెక్కిరిస్తూ వెళ్ళిపోయారు.

సాయంత్రం నేను, అన్నయ్యా కలిసి జోద్పూరు ట్రంకాల్ బుక్ చేస్తే రాత్రి తొమ్మిదింటికి కలిసింది. ఇలా అంటే పెద్దన్నయ్య నమ్మడే. డబ్బు, డబ్బు అంటాడు. "డబ్బు సంగతి తర్వాత చూద్దాం. ఆదివారమే పెళ్ళి. వెంటనే అందరూ బయలుదేరి రండి" అని గట్టిగా చెప్పాం. మంగళవారం బయలుదేరి శుక్రవారం నాటికి మన వూళ్ళో సకుటుంబంగా దిగారు. పాపం వాళ్ళ పెద్దకోడలుకి నిండు నెలలు. ఎంత ఉతుకుష్ట పడిందో! అప్పట్లో సెల్‌ఫోన్లు ఉన్నాయా ఏమన్నానా? వచ్చిందే కబురు ... వెళ్ళిందే కబురు. వాళ్ళు రాగానే తండ్రీ, తల్లీ, కూతురూ ఒకళ్ళనొకళ్ళు కావలించుకుని ఏడ్చారు. అది వాళ్ళకలవాటే. చాలా సెంటిమెంటల్. మా అన్నయ్య ఎంత కోపిష్టో అంత మెత్తటివాడు. సరే ఆ రిసెప్షన్లయ్యాక పెళ్ళివారింటికి వెళ్ళి కాబోయే అల్లుడిని చూసి మా వదిన కళ్ళుతిరిగి పడిపోయింది. ప్రయాణ బడలికతో అలిసిపోయిందని పెళ్ళివాళ్ళకి నచ్చ చెప్పి తిరిగి ఇల్లు చేరాం.

పెళ్ళి పనులలో పిలుపులన్నీ మా చెల్లెళ్ళు చేసారు. షాపింగులు మా బుల్లన్నయ్య, వదిన చేశారు. సత్యంగారు మూడు పూటలా వంటా, వడ్డనకీ కుదిరారు. అసలేవిటో గొప్ప చెప్పుకోవడం కాదు గానీ చాలా టైము మిగిలిపోయినట్లనిపించేది. శనివారం మధ్యాహ్నానికి అందరం పెళ్ళిజరిగే కమ్యూనిటీహాలుకి చేరాం. మగపెళ్ళివారు అయిదుగంటలకి రాగానే కాఫీ టిఫిన్లయ్యాక ప్రధానం అన్నారు. మొన్ననే

తాంబూలాలయ్యాయి కదా మళ్లీ ప్రధానం ఎందుకూ అనుకున్నాం. పెళ్ళి కూతుర్ని కూచోబెట్టి పెళ్ళి ముహూర్తానికి కట్టుకోవాల్సిన పట్టుచీర, రవ్వలు, కెంపులు, పచ్చలు, ముత్యాలు కలిసిన రకరకాల నగలు, హారాలు పెట్టారు. వాటి విలువ ఎంతో నాకు తెలియదు. ఆ నగలన్ని దానికి తగిలించి ఇద్దరు పోలీసులని దానికి కాపలా పెట్టి విడిదికి వెళ్ళారు. అంతకు ముందురోజే మా ఆయన నన్ను హెచ్చరించారు. “ఈ వేళొక్కరోజే నువ్వు దాన్ని ఏమన్నా కేకలేయగలవు. ఆ తరువాత మల్టిమిలియనీరయిపోతుంది జాగ్రత్త” అని. నాకేం తేడా పడుతుంది? నేను స్వతంత్రించి చేస్తున్న ఈ పనిని అన్నయ్య మెచ్చుకుంటే చాలు అనుకున్నాను.

ఆదివారం అనుకున్న ముహూర్తానికి పెళ్ళి చాలాబాగా జరిగింది. అమ్మ వచ్చి బూరెల గంపలో పడింది. వాళ్ళు చెప్పినట్లే పదిహేను వందలమంది వచ్చారు. మా బంధువులు మూడువందలమంది. సత్యంగారు వంట అదరగొట్టేశారు. అందరూ చాలా సంతోషపడిపోయారు. వెలుగు మాసం మండు వేసంకాలం భోజనాలవుతూనే మా చుట్టాలు చాలామంది వెళ్ళిపోయారు. ఇక మగపెళ్ళివారి బంధువులు కూడా వాళ్ళవాళ్ళ కార్లెక్కి వెళ్ళిపోయారు. ఇక ఆడపెళ్ళివారం, మగపెళ్ళివారొక పదిమందీ మిగిలాం.

మా సత్యంగారికి ఎండదెబ్బ తగిలి విపరీతంగా జ్వరం వచ్చింది. దిష్టి తగిలిందో ఏమో! ఇంక ఆయన వుండలేక సాయంత్రానికి ఒక వందమందికి సరిపడా బెండకాయ వేపుడూ, సాంబారు, ఆలు కూరలాంటి సింపుల్ అయిటము చేసి ఇద్దరు కుర్రాళ్ళని వడ్డనకి అట్టేపెట్టి వెళ్ళిపోయారు. మా వైపు బంధువులు కూడా మర్నాడు స్కూళ్ళూ, ఆఫీసులూ వున్నాయని చెప్పి ఏడుగంటలకే సత్యంగారు వండిన వంటలో సింహభాగం వడ్డించుకుని తిని చక్కాపోయారు. ఇంక పెళ్లివారు స్నానాలు చేసి తయారయి వస్తే ఆ నాలుగు మెతుకులు వాళ్ళకి పెట్టేసి బయటపడదామని నేనూ, మా అన్నయ్యలూ, వదినలూ, ఇంకొద్దిమంది మా వాళ్ళూను కూచున్నాం. ఇంత సీదా సాదాగా కథయిపోతే ఏం బాగుంటుంది? ఎనిమిది అవుతుండగా ఒకటి తర్వాత ఒకటి కార్లు రాసాగాయి. కార్లనిండా బోలెడు మంది సూటూబూట్లవారు, షేర్వానీ, కుర్తాల వారూ, పంచె కండువాలవాళ్ళూ, పెద్దలూ, పిన్నలూ, స్త్రీలూ రకరకాల వేషధారణలో రంజైన ముస్తాబులతో కళ్ళు చెదిరిపోయేటట్లు కార్లు దిగారు. చివరికి కారు డ్రైవర్లు కూడా మంచి షోగ్గా వచ్చారు. వాళ్ళ ఉత్సాహం చూస్తుంటే నాకు కాళ్ళూ చేతులూ వణకడం మొదలుపెట్టాయి. ఇంక కళ్ళు తిరిగి పడ్డమొకటే ఆలస్యం. డిన్నరుకి రెండువందల మందిముంటామని ముందే చెప్పారుగా మన

తెలివే ఇలా ఏడిసింది. వెళ్ళిపోయారంటే వెళ్ళిపోయారనుకున్నాగాని అది రెస్టు తీసుకోడానికన్న తెలివిలేకపోయింది. అనుభవరాహిత్యమంటే ఇదేమరి.

నాకు కుడి భుజం లాంటి మా గాంధీ నా పరువు కాపాడాడు. పొద్దున్న పెళ్ళి జరిగిన వేదిక ఎదురుగా ఒక వంద కుర్చీలు వేయించాడు. వచ్చిన వాళ్ళొచ్చినట్లు కూర్చుంటున్నారు. అదృష్టవశాత్తు ఆ పెళ్ళిమండపం మంచి సెంటర్లో వుంది. కొట్టువాడు పంపిన రకరకాల కూల్‌డ్రింకులు కుర్రాళ్ళు అందరికీ ఇవ్వడం మొదలు పెట్టారు. మగపెళ్ళివారసలు మంచి సంగీతప్రియులు. వాళ్ళ డాక్టరు అల్లుడు మంచి హిందుస్థానీ శాస్త్రీయ సంగీత గాయకుడు. మా అన్నయ్యలందరూ చాలా బాగా పాడతారని చెప్పాకదా! అందులో బుల్లెన్నయ్య, వదిన లీడర్లు. నెమ్మదిగా మొదలైన పాటల సందడి ఉధృతమై పన్నెండు గంటల వరకూ క్షణం విరామం లేకుండా సాగింది. ఈలోగా మా కార్లు జీపులు అబిడ్స్ తాజ్‌కి, నాంపల్లి అన్నపూర్ణకి పరుగులు పెట్టి సాంబార్లు, కూరలు తెచ్చాయి. సత్యంగారు వదిలివెళ్ళిన కుర్రాళ్ళ సాయంతో మా అత్తగారు ఓ పది కిలోల బియ్యం వార్చేశారు. చార్‌మినార్ నుంచి వెజ్ బిరియానీలు, మిర్చీ కా సాలన్‌లూ వచ్చాయి. పుల్లారెడ్డిగారి మైసూర్‌పాకులూ, జాంగ్రీలు వచ్చాయి. ఒకటేవిటీ బాదంఖీరు, మసాలాపాన్‌లతో సహా బూజంబంతి విందు హోరెత్తిపోయిందంటే నమ్మండి.

అందుకే ఎప్పుడన్నా ఏ ఫంక్షనయినా రక్తి కట్టాలంటే అర్థబలం వుంటే చాలదు. నమ్మకమైన అంగబలం కూడా వుండాలి. ఈ విందు ఎవరికన్నా గుర్తుందో లేదో గానీ నాకు మాత్రం మరిచిపోలేని అనుభవం మిగిల్చింది.

✤